క్లుప్తంగా

సమష్టి నిర్ణయంతో బొడ్రాయి ప్రతిష్ఠించాలి



మాట్లాడుతున్న వెంకట్

ఇల్లెందు: పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనను ప్రజలందరి సమష్టి నిర్ణయంతో నిర్వహించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ మడత రమ డిమాండ్ చేశారు. ఇల్లెందులో శుక్రవారం ఆమె మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. కొందరు ఏకపక్షంగా కార్యక్రమ నిర్వహణ చేపట్టాలని నిర్ణయించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో పునరాలోచన చేయాలని సూచించారు. మాజీ కౌన్సిలర్లు కొప్పుల ఉమారాణి, బాదావత్ సరోజ, శనిగరపు శృతి, విజయలక్ష్మి, కమల్‌కుమార్ కోరీ, బొబ్బిలి అజయ్‌కుమార్, గుండంపల్లి సతీష్, సీహెచ్.రమేష్, కోడి రాజేందర్, కోటగిరి రాజేందర్, మామిడి శివకుమార్, రాయల్ మున్నా, చంద్రమౌళి, మున్నాఫ్, బొల్లిరాజు, భరత్, శేషు పాల్గొన్నారు.

టీజేఎస్ కమిటీ ఎన్నిక



బరగడి దేవదానం

పాల్వంచ: తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడిగా బరగడి దేవదానం, ప్రధాన కార్యదర్శిగా పగడాల కరుణాకర్‌రెడ్డి నియామకమ్యారు. ఇటీవల ములకలపల్లి మండలంలో జరిగిన ప్లీనరీ సమావేశంలో ఎన్నుకున్న నూతన కమిటీని శుక్రవారం ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా కుడికాల ఆంజనేయులు, జి.రమేశ్, సహాయ కార్యదర్శిగా ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలిగా కె.లక్ష్మి, రాష్ట్ర కమిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కే.నబీసాహెబ్‌లను నియామకం అయ్యారు.

శ్మశాన వాటికల్లో సోలార్ లైట్లు



సోలార్ లైట్ పని చేసే విధానాన్ని వివరిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: విద్యుత్ సౌకర్యం లేని శ్మశాన వాటికల వద్ద సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జూలూరుపాడు, వెంగన్నపాలెం, కొమ్ముగూడెం, శంభునిగూడెం, నల్లబండబోడు శ్మశాన వాటికలకు విద్యుత్ సౌకర్యం లేదన్నారు. ఆయా గ్రామ పంచాయతీల నిధులతో ఒక్కో సోలార్ లైట్ రూ.5,200 ఖర్చుతో క్రిమిటోరియంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సోలార్ లైట్స్‌ను రిమోట్‌తో ఆన్, ఆఫ్ చేసుకోవచ్చునన్నారు. సోలార్ లైట్లను ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించినట్లు చెప్పారు.

రోడ్డు పనులను అడ్డుకున్న స్థానికులు



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి గణేష్‌టెంపుల్ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్థానికులు శుక్రవారం పనులను అడ్డుకున్నారు. పనులు ప్రారంభించిన ప్రాంతం నుంచి రోడ్డుకు ఇరువైపుల ఉన్న అడ్డంకులను తొలగించకుండా ఇష్టం వచ్చినట్లు తొలగిస్తున్నారని, సరైన పద్ధతి లేదంటూ పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్థానికులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అధికారులు అక్కడ పనులు నిర్వహించకుండా పక్కనున్న ప్రాంతం నుంచి పనులు చేయించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



కనకమ్మ (ఫైల్)

చుంచుపల్లి: నాలుగు తరాల శతాధిక వృద్ధురాలు జడల కనకమ్మ చుంచుపల్లి రాంనగర్‌లో శుక్రవారం మృతి చెందింది. కనకమ్మకు నలుగురు కూతుర్లు కాగా వారిలో ఇద్దరు మరణించారు. ప్రస్తుతం ఆమె చిన్న కూతురు వద్ద ఉంటోంది. ఈ 105 ఏళ్లలో కనకమ్మ తన కూతుళ్లు, మనవరాళ్లు, వారి పిల్లలను మొత్తం నాలుగు తరాల సంతానాన్ని చూసింది. కనకమ్మకు సంతానం మొత్తం దాదాపు 50 మంది వరకు ఉంటారని కుటుంబసభ్యులు, బంధువులు తెలిపారు.

మంజూరుకే పరిమితం..

- ప్రారంభానికి నోచుకోని జీపీ భవన నిర్మాణాలు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పాఠశాలలోని ఒక గదిలో కొనసాగుతున్న మస్సివాగు గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: స్థానిక పాలన ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం చిన్న గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. ఆయా గ్రామపంచాయతీలకు కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా భవనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, ఖాళీ భవనాలను ఎంపిక చేసి అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఇరుకు గదులలో కార్యాలయం నిర్వహించుకోవడం అధికారులకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో పక్కా భవనాలు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. కానీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

17 పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు...

రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఆవిర్భవించిన గ్రామ పంచాయతీలలో మొదటి విడతగా కొన్ని గ్రామపంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్, ఐటీడీఏల ద్వారా నిధులు మంజూరు చేస్తూ 2023 జనవరి 13వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇల్లెందు మండలంలో బొజ్జాయిగూడెం, పూబెల్లి, సుభాష్‌నగర్, సీఎస్పీ బస్తీ, రేపల్లెవాడ, లచ్చగూడెం, మామిడిగుండాల, ధనియాలపాడు, మిట్టపల్లి, బోయితండా, పోచారంతండా, మస్సివాగు, ముత్తారపుకట్ట గ్రామపంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా, మామిడిగుండాల, మర్రిగూడెం, బాలాజీనగర్, మొండితోగు గ్రామపంచాయతీలకు ఐటీడీఏ ద్వారా ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిధుల మంజూరుకు ముందే ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆయా గ్రామపంచాయతీలలో భవనాల నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను ఎంపిక చేసి రెవెన్యూ శాఖ ఆమోదంతో మండల స్థాయి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు...

గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరై ఐదు నెలలు గడుస్తున్నా కనీసం శంకుస్థాపన చేసిన దాఖలాలు కూడా లేవు. ప్రజాప్రతినిధులు సైతం సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, మట్టి రోడ్ల నిర్మాణంపై చూపిన ఆసక్తిని గ్రామపంచాయతీ భవన నిర్మాణాలపై చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిధులు సరిపోవని..

గ్రామపంచాయతీల భవన నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. కానీ ఈ నిధులు సరిపోవనే సాకుతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు ఖర్చు అయ్యాయి. దీన్ని ఉదాహరణగా చూపుతూ గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ససేమిరా అంటున్నారు.

ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు..

జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన ఒడ్డుగూడెం గ్రామపంచాయతీకి ప్రభుత్వం పోత్సాహకంగా రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామపంచాయతీ భవనం తక్షణమే నిర్మించాలని ఆదేశించింది. దీంతో ఆరు నెలలు క్రితమే నిర్మాణం పూర్తి చేశారు. కానీ ప్రారంభోత్సవానికి మాత్రం నోచుకోవడం లేదు. దీనిలో పలు రాజకీయ కోణాలు ఉన్నాయని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

అధికారులు చొరవ తీసుకోవాలి



గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. నిధులు సరిపోవనే సాకుతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అధికారులు చొరవ తీసుకొని నిధులు పెంచి లేదా ఉన్న వాటితోనే నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– కుంజ కృష్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ఇల్లెందు మండలం

పనులు ప్రారంభిస్తాం



మండలంలో 13 గ్రామపంచాయతీల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించాము. కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నాం. ఇప్పటి వరకు ముత్తారపుకట్ట గ్రామపంచాయతీ భవనానికి ముగ్గు పోశాం. ఒకటి రెండు రోజుల్లో మరికొన్ని పంచాయతీలలో ముగ్గుపోసి పనులు ప్రారంభిస్తాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, ఇల్లెందు మండలం

ఆక్రమణల తొలగింపు అడ్డగింత



అధికారులను అడ్డుకుంటున్న మహిళలు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావు కాలనీలో ఇటీవల పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారుల తొలగింపును బాధితులు అడ్డుకున్నారు. వివరాలు... సర్వే 727 ప్రభుత్వ భూమిలో రేవంత్ యువసేన జిల్లా కన్వీనర్ రాంబాబు ఆధ్వర్యంలో 100 మంది పేదలు ఇటీవల గుడిసెలు వేసుకుని రేవంత్ నగర్ అని నామకరణం చేసుకున్నారు. కాగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్, తహసీల్దార్ రంగాప్రసాద్, పోలీసులు కలిసి జేసీబీతో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించే ప్రయత్నం చేశారు. కాగా అక్కడి మహిళలు.. ఆర్ఐ రవి, హచ్చా, మున్సిపల్ సిబ్బందిని అడ్డుకున్నారు. పెట్రోల్ బాటిళ్లు తెచ్చుకుని పోసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వనమా, తహసీల్దార్ రంగా ప్రసాద్‌లకు వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. సుమారు రెండు గంటల పాటు వివాదం జరిగింది. ఎండ తీవ్రత కారణంగా అధికారులు సైతం వెనుదిరిగారు. ఎండ తీవ్రతకు రాధిక అనే మహిళ స్పృహ తప్పి పడిపోవడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు



సుజన్ నితీష్

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలకు (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ) సీఓఈ విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. 31 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కొత్తపల్లి సుజన్ నితీష్ 11,994 ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినంధించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ..



బి.నాగరాజు 1,599 ర్యాంక్



కె.గణేష్ 2,946 ర్యాంక్



కె.అల్లేష్ 3,174 ర్యాంక్

లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల(సీఓఈ)కి చెందిన ముగ్గురు విద్యార్థులు బీఆర్క్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) గురువారం ప్రకటించిన ఫలితాల్లో జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్ (బీఆర్క్) ఫైనల్ ఫలితాల్లో గురుకులానికి చెందిన బి.నాగరాజు 1,599వ ర్యాంక్, కె.గణేష్ 2,946, కె.అల్లేష్ 3,174 ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కన్నెకంటి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు.



మర్మం చరణ్‌తేజ్

పాలీసెట్‌లో...

పాలీసెట్‌లో కిన్నెరసాని డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి మర్మం చరణ్‌తేజ్ 4,424 ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. మొత్తం 20మంది పాలీసెట్ రాసి అర్హత సాధించినట్లు తెలిపారు.

మోహన్‌రెడ్డికి 30వ ర్యాంకు..

పాల్వంచ: 2023 సంవత్సరం పాలిసెట్ ఎంట్రన్స్‌లో పాల్వంచకు చెందిన టి.మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయి 30వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్‌వీ ట్యూటోరియల్స్ నిర్వాహకులు పి.యల్లయ్యరెడ్డి మోహన్‌రెడ్డిని అభినందించారు.

రోహిణీ కార్తె.. మండుతున్న ఎండలు..



టేకులపల్లి సంత వద్ద చెట్టు నీడలో పశువులు

రోహిణీ కార్తె వచ్చింది. ఎండలు భగ్గుమంటున్నాయి. బహిరంగ ప్రాంతంలో ఉన్న రాళ్లు పగిలిపోతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది భానుడి తీవ్రత బాగా పెరిగింది. ప్రజలు విలవిల్లాడుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఇక మూగ జీవాల పరిస్థితి మరింత దారుణం. గతంలో ఎప్పుడో ఒకసారి 40 డిగ్రీలు ఉండే ఉష్ణోగ్రతలు ఈసారి రెండు వారాలుగా ప్రతిరోజూ 40, 41, 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని మూగజీవాలు రోజంతా గ్రామ పరిసరాల్లోని చెట్ల నీడనే తిష్టవేస్తున్నాయి. టేకులపల్లి సంత వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకే పశువులు చెట్టు నీడకు చేరాయి. ఎండల తీవ్రతకు ఈ దృశ్యమే సాక్ష్యం. ఈ ఫొటోను 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– టేకులపల్లి

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచ: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 సంవత్సరానికి గాను ప్రవేశాలకు జూన్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పాల్వంచ వీరభద్ర ఐటీఐ కరస్పాండెంట్ ముత్యాల ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ 100, ఫిట్టర్ 40, సివిల్ 22 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయండి

టేకులపల్లి: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్స్, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్స్, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనల్లో భాగంగా టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, సర్పంచ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామ పచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన కనీస బేసిక్‌ను వేతనంగా చెల్లించాలని, జీఓ 60 ప్రకారం.. స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్, కారోబార్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనం ఇవ్వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, నాయకులు, ఎట్టి నరసింహారావు, డి.ప్రసాద్, సిరికొండ నాగేశ్వర్‌రావు, ఎం.వెంకటేశ్వర్లు, రమాదేవి పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ



ఆవిష్కరిస్తున్న జీవన్‌కుమార్

పాల్వంచ: ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక దమ్మపేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని టీడీపీ నాయకులు కనగాల అనంతరాములు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ కుమార్ మాట్లాడుతూ.. దివంగత ఎన్‌టీఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. కరుణాకర్, నరేశ్, దుర్గారావు, వీరన పాల్గొన్నారు.

బోరుమోటార్ దగ్ధం

ఇల్లెందురూరల్: ధనియాలపాడు పంచాయతీ బాలాజీతండా సమీపంలో శుక్రవారం బోరు మోటార్ దగ్ధమైంది. బాలాజీతండా, సేవ్యాతండా గ్రామాలకు తాగునీటి అవసరాలకు గతంలో బోరు వేసి మోటార్ బిగించారు. పక్కనున్న మొక్కజొన్న దంటుకు నిప్పు పెట్టడంతో మంటలు బోరుమోటార్ వరకు వ్యాపించాయి బోరు పైపులు, స్టార్టర్, సర్వీస్ వైరు కాలిపోయాయి.

జ్వరపీడితులకు ఎమ్మెల్యే పరామర్శ



పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం పంచాయతీ చింతవర్రె గ్రామంలోని విష జ్వర పీడితులను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఇంటింటికీ తిరిగి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బాధితులకు ధైర్యం చెప్పారు. మాట్లాడుతూ.. జ్వరాల బారిన పడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, డెంగీ లక్షణాలు ఉన్న వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అవసరమైయితే స్పెషలిస్టులను గ్రామానికి రప్పించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. జ్వరాలు తగ్గుముఖం పట్టేంత వరకు వైద్య శిబిరం కొనసాగించాలన్నారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అటవీ ప్రాంతంలో ఉన్న చింత్రవర్రె గ్రామానికి వెళ్లవద్దన్ని పోలీసులు వారించినా.. ఎమ్మెల్యే చింతవర్రె గ్రామానికి వెళ్లి జ్వరపీడితులను పరామర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుక్రుత, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రమేష్, ఎస్‌కే అన్వర్‌పాషా, జక్కుల సుందర్, ఎంఏ రజాక్, కాసుల వెంకట్, బరపాటి ప్రసాద్, కాసుల వెంకట్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం వాయిదా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: పట్టణంలోని సింగరేణి స్కూల్ మైదానంలో శనివారం సాయంత్రం జరగాల్సిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని 29వ తేదీకి వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సమ్మేళనానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరుకావాల్సి ఉండగా.. మంత్రి సీఎం సూచన మేరకు హైదరాబాద్ వెళ్తుండడంతో వాయిదా వేశామని తెలిపారు. కాగా, ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలకు మంచి స్పందన వస్తోందని చెప్పారు. కొమురారం, బోడు, కంబాలపల్లి లాంటి పల్లెల్లో తొలిసారి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల ముంగిట్లోకి చేరడంతో విజయవంతం చేశారన్నారు. కాగా వచ్చే నెల 24 నుంచి పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో చిరకాల స్వప్నం నెరవేరబోతోందని పేర్కొన్నారు. అయితే డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవం మాత్రం శనివారమే జరుగుతుందని హరిప్రియ చెప్పారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో పాటు పులిగళ్ల మాధవరావు, జేకే శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, పీవీ కృష్ణారావు, సుధీర్ తోత్లా, మనోహర్ తివారీ, సిలివేరు సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిరండి..



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి వేలాదిగా యువతీ, యువకులు తరలిరావాలని బీజేపీ టేకులపల్లి మండల అధ్యక్షుడు ధరావత్ బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుద్యోగ మార్చ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కేసీఆర్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ నోటిఫికేషన్ రద్దు చేసి 35 లక్షల మంది యువతను మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి రూ.3016 హామీ నేటికీ అమలు కావడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్ వాంకుడోత్ హత్తీరామ్ నాయక్, యువతీ, యువకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..



సదస్సులో పాల్గొన్న భారత్ బచావో ప్రతినిధులు

చుంచుపల్లి: మనువాద రాజ్యాంగాన్ని వ్యతిరేకిద్దాం.. భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.. అని భారత్ బచావో ప్రతినిధులు అన్నారు. భారత్ బచావో జిల్లా సదస్సు కొత్తగూడెంలో శుక్రవారం మల్లెల రామనాథం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భారత్ బచావో నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, తాళ్లూరు వెంకటేశ్వరరావు, గొల్లపల్లి దయానంద్, అబ్దుల్ బాసిత్, రమేష్ కుమార్ మక్కడ్ తదితరులు మాట్లాడుతూ.. మన పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేసి స్వాతంత్రం సంపాదించి ఈ దేశంలో సామాజిక ఆర్థిక రాజకీయంగా అన్ని వర్గాల ప్రజలకు సమానంగా అందించి సామాజిక న్యాయం సాధించాలని కలలు గన్నట్లు చెప్పారు. కానీ నేటి పాలకులు.. రైతులు, నిరుద్యోగులు, కార్మికుల బతుకులను బజారు పాలు చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. దేశంలో వేల సంవత్సరాలుగా కింది వర్గాల ప్రజలను కనీసం మనిషిగా చూడని దుర్మార్గపు మనువాదాన్నే రాజ్యాంగంగా తేవాలని శరవేగంగా పావులు కదుపుతున్నారని విమర్శించారు. ఇటువంటి ప్రమాదకర పరిస్థితిలో దేశాన్ని, భారత రాజ్యాంగాన్ని రక్షించు కోవలసిన బాధ్యత దేశభక్తి కలిగిన మన పైననే ఉందని అందుకోసం భారత రాజ్యాంగాన్ని గౌరవించే అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు కులమత మైనార్టీలు ఐక్యమై భారత్ బచావో నినాదంతో ఒకే వేదిక పైకి వచ్చి మరో స్వాతంత్ర పోరాటం చేసేందుకు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో డాక్టర్ బత్తుల కృష్ణయ్య, మండవ సుబ్బారావు, కొల్లి నాగేశ్వరరావు, న్యాయవాది కోటం రాజు, చలికంటి శ్రీనివాస్ భూక్యా రమేష్, తాండ్ర వెంకటేశ్వర్లు, చారువాక, రామాచారి, ఎస్‌కే నబీసాహెబ్, దేవదానం, సురేందర్, శ్రీనివాస్, స్వామి దాస్, నాగేశ్వరరావు విశ్వనాథం అమీద్, మోయిన్ నాజర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

40 రోజులుగా నిరవధిక సమ్మె



టేకులపల్లిలో సమ్మె చేస్తున్న వీఓఏలు

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం 40వ రోజుకు చేరింది. నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో ఐకేపీ వీఓఏలు వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాపితంగా వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగ భద్రత, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని, ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మూడ్ చరణ్, మండల అధ్యక్షురాలు చంద్రకళ, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, రాజు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రభుత్వాస్పత్రిలో వ్యర్థాల నిల్వ



ప్రశ్నించాల్సిన అధికారి : కుమారస్వామి, సూపరింటెండెంట్, సర్వజన ఆస్పత్రి
సెల్ నంబర్: 9392336210

కొత్తగూడెంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వ్యర్థాలు పేరుకపోయాయి. అటుగా వెళ్లిన ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యర్థాలు మార్చురీ రూం, పేషెంట్ల వార్డుకు మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో పడేసి ఉన్నాయి. దీని పక్కనే వార్డు ఉండడం వలన చికిత్స పొందుతున్న రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలను నిల్వ ఉండకుండా తరలించాలని రోగుల బంధువులు కోరుతున్నారు. – కొత్తగూడెంఅర్బన్